క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపేట/రావులపాలెం: 132 కేవీ హెచ్‌టీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం కొత్తపేట మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రావులమ్మ ఆలయంలో ఏకాహం


రావులమ్మ అమ్మవారు

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి ఆలయంలో 21వ ఏకాహాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏటా అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏకాహం జరుపుతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రావుమల్మ అమ్మవారిని గ్రామ ఆడపడుచులు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

లివర్ కిడ్నీ బాధిత పాపకు ఆర్థిక సాయం


పాప తల్లికి సాయం అందజేస్తున్న అక్షయ సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పి.మీనాక్షి(3)కి లివర్, కిడ్నీ ఫెయిల్యూర్ కావడంతో తిన్నది జీర్ణం కాక రక్త వాంతులు అవుతున్నాయి. పాప ఆపరేషన్‌కి రూ.7 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పాపకు తండ్రి లేకపోవడంతో తల్లి మాత్రమే కుటుంబాన్ని పోషిస్తుంది. పాప వైద్య నిమిత్తం సాయం చేయమని అక్షయ సేవా సంస్థ సభ్యులను కోరడంతో రూ.12 వేల నగదును సంస్థ సభ్యులు శుక్రవారం అందజేశారు.

26న సైన్స్ సంబరాలు

మలికిపురం: ఈ నెల 26న లక్కవరం ప్రగతి పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు నుంచి పదో తరగతి విద్యార్థులు తమ తమ నమూనాలను ఈ నెల 24 లోపు పాఠశాలలో నమోదు చేయించుకోవాలని కూడా నిర్వాహకులు తెలిపారు.

29న నూతన ఆలయ ప్రతిష్ఠ

మామిడికుదురు: గ్రామంలోని వాసంశెట్టివారి పాలెంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 29వ తేదీ గురువారం జరుగుతుందని కమిటీ శుక్రవారం తెలిపింది. వాసంశెట్టి సత్యనారాయణమూర్తి, వెంకట రామాకాంత్‌బాబు, కవిత దంపతులతో నిర్మించిన ఆలయ ప్రతిష్ఠ 29వ తేదీ ఉదయం 9.50 గంటలకు జరుగుతుందన్నారు. ఈ నెల 27వ తేదీ మంగళవారం నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 27, 28 తేదీల్లో పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో రూ.58 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు శుక్రవారం పూర్తయ్యాయి. స్థానిక పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం నుంచి మురుగుకాలువ వరకూ సుమారు రెండు కిలోమీటర్ల ఈ రోడ్డు నిర్మాణం జరిగింది ఇదే రహదారిలో ఓఎన్జీసీ రిగ్ ఉండటంతో తరచూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండేవి. దీని వల్ల రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సర్పంచ్ సంగీత సుభాష్ చొరవ తీసుకుని రైతులు సమస్యలు తెలుసుకుని ఆ విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఓఎన్జీసీ మంజూరు చేసిన నిధులతో బీటీ రోడ్డును నిర్మించారు. దీంతో తమ పొలాల్లోకి వెళ్లేందుకు అవస్థలు తప్పడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో మాదిగల వైఖరి వెల్లడిస్తాం

రావులపాలెం: ఆంధ్రలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే రాజకీయ పార్టీలపై మాదిగల వైఖరిని వెల్లడిస్తామని ప్రధానంగా రెండు అంశాలను ఆధారంగా తమ వైఖరి ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం రాత్రి రావులపాలెం శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, దళితులకు ఇచ్చే సీట్లలో సగభాగం మాదిగ ఉపకులాలకు కేటాయించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని రాజకీయ పార్టీల నిర్ణయం మేరకు తమ వైఖరిని మార్చి మొదటి వారంలో వెల్లడిస్తామని ఆయన అన్నారు. ఆంధ్రాలో మాలలకు, మాదిగలకు మధ్య తేడా ఒక పర్సెంట్ మాత్రమేనని, అయితే ఉత్తరాంధ్రలో రెల్లి, పైడి, పాకి కులాలతో కలుపుకుంటే మాదిగ ఉపకులాలే ఎక్కువ మంది ఉన్నారని అందువలన అసెంబ్లీ సీట్లలో గానీ, పార్లమెంట్ సీట్లలో గాని, మరే ఇతర శాసనమండలి, రాజ్యసభ సీట్లలో గానీ మాదిగలకు సగభాగం కేటాయించిన వారికి తమ మద్దతు ఉంటుందన్నారు.

మారుతున్న గ్రామాల రూపురేఖలు

- కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- గోపాలపురంలో ఎమ్మెల్యేకి జన నీరాజనాలు
- ఎస్సీ పేటలో ఘన స్వాగతం
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభం, శంకుస్థాపనలు


గోపాలపురంలో చిర్ల సోమసుందరరెడ్డి ఎంపీపీ పాఠశాల భవన ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, అవంతి సీఫుడ్స్ ఎండీ అల్లూరి ఇంద్రకుమార్ తదితరులు


గోపాలపురంలో రూ.9 కోట్లతో నిర్మించిన డబుల్ సీసీ రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామాల రూపురేఖలు సమూలంగా మారుతున్నాయనడానికి గోపాలపురం గ్రామం ఒక చక్కని ఉదాహరణ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గోపాలపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటిస్తూ పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన గ్రామానికి, అక్కున చేర్చుకుంటున్న నియోజకవర్గ ప్రజలకు ఎంత చేసినా తక్కువే అని సుమారు రూ.2,900 కోట్లతో నియోజకవర్గానికి వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందించామని, ఇంకా చేయవలసిన పనుల చాలా ఉన్నాయని అవి కూడా చేసి చూపిస్తామన్నారు. ఎలాంటి జన్మభూమి కమిటీల సిఫారసులు, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా వలంటీర్ల ద్వారా ప్రజల బ్యాంక్ ఖాతాల్లోకే జమచేయడం జరుగుతుందన్నారు. గోపాలపురం గ్రామంలో సిద్ధార్థ నగర్‌లో జగ్గిరెడ్డి కుటుంబం ఇచ్చిన స్థలంలో జగ్గిరెడ్డి చొరవతో అవంతి సీ ఫుడ్స్ వారి ఆర్థిక సహకారం రూ.60 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని అవంతి సీఫుడ్స్ ఎండీ అల్లూరి ఇంద్రకుమార్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం హైవే నుంచి లాకు వరకూ ఆర్‌అండ్‌బీ నిధులు రూ.9 కోట్లతో నిర్మించిన సీసీ డబుల్ లైన్ రోడ్డు, డివైడర్, రిటైనింగ్ వాల్ పనులను, అలాగే జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.2.36 కోట్లతో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభించారు. అలాగే రూ.17 లక్షలతో ఆధునికీకరించిన తేతలి వీరారెడ్డి మెమోరియల్ పీహెచ్‌సీను ప్రారంభించారు. రూ.20 లక్షలతో అరుంధతి పేటలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన గౌడ కమ్యూనిటీ భవనాన్ని, రూ.5 లక్షలతో నిర్మించిన రజక కమ్యూనిటీ భవనాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన బ్రాహ్మణ రామలయాన్ని ప్రారంభించారు.

అలాగే రూ.40 లక్షలు రుడా నిధులతో పంచాయతీ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, కాలువ అవతల కాలువ గట్టు రోడ్డు మరమ్మత్తు పనులకు, రూ.12 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా గోపాలపురంలో సుమారు రూ.58 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. సుమారు రూ.50 కోట్లతో గోపాలపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులకు ప్రతిపాదనలు పంపడం, దానికి సంబంధించిన సర్వే రూ.8 లక్షలతో పూర్తిచేశామన్నారు. గ్రామంలోని 3 గ్రామ సచివాలయాల పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు రూ.57.5 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ సంక్షేమ పథకాలు నేరుగా మన ఇంటికే పంపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే 2024లో జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, సర్పంచ్ సబ్బితి మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కప్పల శ్రీధర్, వైవీ, చిర్ల రామచంద్రారెడ్డి, కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు


లబ్ధిదారులకు ఓటీఎస్ పత్రాలను అందిస్తున్న జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు

అంబాజీపేట: పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవితాల్లో సంక్షేమ పథకాలతో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేలా ఆశీర్వదించాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వక్కలంక, ఇరుసుమండ గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం శుక్రవారం జరిగింది. ఇన్‌చార్జి వేణుగోపాలరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఎటువంటి విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరం కలసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిత్యం మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం నూతనంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులైన విత్తనాల శేఖర్‌ను, ఇన్‌చార్జి వేణుగోపాలరావును, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావులను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సత్కరించారు. అంతకుముందు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పత్రాలను ఏడుగురు లబ్ధిదారులకు వేణుగోపాలరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వాసంశెట్టి పెదబాబు, జనుపల్లి ఏడుకొండలు, మట్టపర్తి హరి, బుడితి సత్యనారాయణమ్మ, నాగాబత్తుల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష


పెదపట్నంలంక ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రశాంత్

మామిడికుదురు: పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము పేర్కొన్నారు. పెదపట్నంలంక గిడుగువారిపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజీ ప్రశాంత్ ఆధ్వర్యంలో డాక్టర్లు మాధురి, అనూష, అప్పాల మిక్ హూస్సేన్‌లు శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. బీపీ, సుగరు, రక్త పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు ఈసీజీలు తీశారు. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలందించారు. సుమారు 350 మందికి వైద్య సేవలందించారు. మండల శాఖ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, అప్పనపల్లి దేవస్థానం ట్రస్టీ కొమ్ముల సూరిబాబు, పార్టీ నేతలు విప్పర్తి నాగేశ్వరరావు, మామిడిశెట్టి రాధామనోహర్, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.సూరిబాబు, ఏఎన్ఎంలు ఎం.తల్లీనాగమణి, పి.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీలు ఎన్.డోర్కస్, పి.నాగదుర్గ, ఆశ కార్యకర్తలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి


రక్తహీనత నివారణ-పరీక్షల ప్రామాణికంపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఒక్కరి ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందించాలని వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ అన్నారు. మండలంలోని పెదపళ్ల ఎస్‌బీపీబీకె కల్యాణ మండపంలో శుక్రవారం రక్తహీనత నివారణ-పరీక్షల ప్రామాణికం అనే అంశంపై వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి పెదపళ్ల, చొప్పెల్ల, ద్వారపూడి, కేశవరం పీహెచ్‌సీలతో పాటు మండపేటకు చెందిన గొల్లపుంత, హరిజనపేట యూపీహెచ్‌సీల వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఆధునిక పద్ధతుల్లో రక్తహీనత పరీక్షలు చేసే విధానాన్ని హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రత్యేక సాంకేతిక నిపుణులు సాయితేజ, సూర్యనారాయణ విచ్చేసి హెచ్‌బీ మీటర్ ద్వారా రక్తహీనత పరీక్షలు చేసే విధానాన్ని వివరించారు. ఆరోగ్య రక్షణలో రక్తహీనత పరీక్షలు అత్యంత ప్రామాణికమని, దానికనుగుణంగా ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు చేపట్టే హెచ్‌బీ పరీక్షలు నివేదికను ఎప్పటికప్పుడు యాప్‌లో నిక్షిప్తం చేయాలని వారు సూచించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది లేవనెత్తిన సందేహాలను వైద్యాధికారులు నివృత్తి చేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

గోదావరి మాతకు పున్నమి హారతి


జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో అఖండ గౌతమీ గోదావరి తీరంలో గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శోభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంకాలం ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళ భక్త బృంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనార్దన భజన మండలి సభ్యుల బృందం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలిత సహస్రనామాలు, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ పఠించారు. అనంతరం స్థానిక శివాలయానికి విచ్చేసి జ్వాలాతోరణంలో పాల్గొన్నారు.

అధికారులు పౌర్ణమి స్నానాలు ఏర్పాట్లు పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో తొమ్మిదో రోజు శనివారం మాఘపౌర్ణమి సందర్భంగా బీచ్ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే సమయంలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లను, భక్తులకు సంబంధించి ఇతర ఏర్పాట్లను పోలీసు, దేవస్థానం అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, స్థానిక ఎస్సై ఎస్.రాము పరిశీలించారు. ఒడ్డున స్వామికి నిర్వహించే విశేషపూజలు, స్వామిని సముద్రం స్నానానికి తీసుకువెళ్లే క్రమంలో తగిన భద్రత గురించి వారు సమీక్షించారు. అలాగే ఒడ్డున భక్తులకు గతంలో మాదిరిగా జల్లు స్నానం ఏర్పాట్లను కూడా వారు పరిశీలించారు. వీటితో పాటు సముద్రంలో స్వామివారితో పాటు స్నానం చేసే సమయంలో తొక్కిసలాట లేకుండా భక్తుల భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలను, భక్తులు లోతు జలాల్లోకి వెళ్లనీయకుండా సముద్రంలో ఏర్పాటు చేసిన సర్వేబాదుల బారికేడ్లను వారు పరిశీలించారు. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ బైరా నాగరాజు, యేసుబాబు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చన


ఈదరాడలో జరిగిన కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాలతో కుంకుమార్చన పూజలను ఘనంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 300కు పైగా మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి భక్తులు చలివిడి, పానకాలను సమర్పించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. ఈ నెల 20 నుంచి నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు చలిమిడి, పానకాల చెల్లింపుతో సంపూర్ణమయ్యాయి. ఆలయ పునః నిర్మాణ కమిటీ రథసారథి యెరుబండి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలను వైభవంగా జరిపించారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పి.గన్నవరం: ముంగండ గ్రామంలో పునర్నిర్మించిన ముత్యాలమ్మ వారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, పుణ్యహావచనం, పంచగవ్యం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపనం, ధ్వజారోహణ తదితర పూజలు జరిగాయి. 25వ తేదీ ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీచ్‌లో జల్లు స్నానానికి విస్తృత ఏర్పాట్లు


అంతర్వేది బీచ్‌లో ఒడ్డును జల్లు స్నానానికి ఏర్పాటు చేసిన ఆలయ ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో పౌర్ణమి స్నానాలు పురస్కరించుకుని ఒడ్డున భక్తుల కోసం దేవస్థానం జల్లు స్నానానికి విస్తృత ఏర్పాట్లు శుక్రవారం పూర్తి చేసింది. శనివారం సముద్రంలో సుదర్శన చక్రధారుడైన స్వామివారితో పాటు స్నానం చేయలేని భక్తులకు జల్లు స్నానం ద్వారా స్వామి కరుణ, కటాక్షాలు కలుగజేసేందుకు ఈ ఏర్పాట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ చేశారు. ఇందుకు ఒడ్డున సర్వే బాదులతో ప్రత్యేక లైను ఏర్పాటు చేసి, మధ్యలో అరప కట్టారు. అరపపై సుదర్శన చక్రధారుడైన లక్ష్మీ నృసింహుని విగ్రహాన్ని ఆశీనులు చేసి, విగ్రహంపై నుంచి ప్రత్యేక పైపు మార్గం ద్వారా సముద్ర జలాలు జారవిడుస్తారు. అరప కింద భాగంలో క్యూ లైన్‌లో భక్తులు వెళ్లే క్రమంలో అరప పై నుంచి స్వామి విగ్రహం మీదుగా జారవిడిచే జలాలు భక్తుల శిరస్సులపై పడతాయి. కాగా చివరి సారిగా ఈ ఏర్పాట్లు 2019 ఉత్సవాల్లో చేశారు. నాలుగేళ్ల విరామం అనంతరం ఈ ఏడాది జల్లు స్నానంకు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తీసుకున్న చొరవతో పునరుద్ధరించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి పాల్గొన్నారు.

ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో సీట్లు ఉచితం


అంబాజీపేటలో పాంప్లేట్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు వెంకటేశ్వరరావు, ప్రకాష్

అంబాజీపేట: ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట మండల రీసోర్స్ భవనం వద్ద విద్యా హక్కు చట్టం పాంప్లేట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అమలయ్యే ఐబీ/ఐసీఎస్‌ఈ/సీబీఎస్‌ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉందన్నారు. అనాథ, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ ట్రైబ్స్‌కు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన మైనార్టీ, ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఏడాదికి రూ.1.20 లక్షలు లోబడి ఉన్న వారికి 6 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఐదేళ్లు నిండి అర్హులైన వారు ప్రస్తుత చిరునామా, ఆధార్, ఓటరు, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 14వ తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందజేత


తాడేపల్లిలో విజయసాయిరెడ్డిని కలసిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర నాయకులు

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాన్ని అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు, పి.గన్నవరానికి చెందిన మేడిది పరంధామయ్య, ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు శుక్రవారం తాడేపల్లిలో రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. గత 17 ఏళ్లుగా తమకు జీతాలు పెరగడం లేదని వారు వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారని వారు తెలిపారు. విజయసాయి రెడ్డిని కలసిన వారిలో రాష్ట్ర యూనియన్ సభ్యులు గణేష్, వెంకటేశ్వరరావు, చైతన్య, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ప్రార్థన స్థలాల పరిరక్షణకు చర్యలు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న వెస్లీ

ఆత్రేయపురం: రాష్ట్రంలో ప్రార్థనా స్థలాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొండా జాన్ వెస్లీ తెలిపారు. శుక్రవారం ఆయన ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో ఇటీవల గుర్తు తెలియని దుండగుల వల్ల దగ్ధమైన బైబిల్ మిషన్ చర్చి ప్రాంతాన్ని జాన్ వెస్లీ జిల్లాలోని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబూరావు, కార్యదర్శి విజయ్ సుందరంతో కలసి పరిశీలించారు. వెస్లీ మాట్లాడుతూ వద్దిపర్రులో చర్చిని దగ్ధం చేయడం దురదృష్టకరమైన చర్యని ఇటువంటి చర్యలను అందరూ ఖండించాలన్నారు. ప్రార్థనా మందిరాలు పాడు చేయడం హేయమైన చర్యని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ఈ చర్యకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చర్చి పునర్నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు.

మాజీ ఆర్మీ మేజర్ 'నేకూరి' మృతి


నేకూరి మల్లేశ్వరరావు (ఫైల్)

రావులపాలెం: గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ మేజర్ నేకూరి మల్లేశ్వరరావు(84) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన సుదీర్ఘ కాలం దేశరక్షణ కోసం ఆర్మీ మేజర్‌గా పనిచేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ జి.మునిరెడ్డి తదితరులు పూల దండలతో ఘన నివాళులర్పించి నేకూరి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

అధికారులు సహకరిస్తే పట్టాలు అందిస్తాం

ఉప్పలగుప్తం: అధికారులు సహకరిస్తే రీసర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూమిని గ్రామస్తులకు ఇళ్ల పట్టాలుగా అందిస్తామని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తమ గ్రామానికి చెందిన 99 మంది లబ్ధిదారులకు స్థానికంగా స్థలం లేదంటూ కిత్తనచెరువులో ఇళ్ల పట్టాలు అందించారన్నారు. అయితే అంతదూరం వెళ్లలేమంటూ లబ్ధిదారులు తిరస్కరించారని చెప్పారు. ఇటీవల జరిగిన జగనన్న భూసర్వేలో గ్రామంలో ప్రభుత్వ భూమి కొందరి ఆక్రమణలో ఉందని తేలిందన్నారు. సర్వే నెంబర్ 109లో 94 సెంట్లు, 110లో 64 సెంట్లు, 116లో 99 సెంట్లు, 168/2లో 58 సెంట్ల భూమి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు అనువుగా ఉన్నాయన్నారు. వీటితో పాటు 1992లో శివాలయం కాలనీలో 135 మందికి పట్టాలు అందించినా అపోహలతో వాటిలో కొన్ని ఖాళీగా ఉంచేశారన్నారు. ప్రస్తుతం వాటిని ఇళ్ల స్థలాలుగా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.